క్లుప్తంగా

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ గంగరాజు

కోడుమూరు రూరల్: మండలంలో వివిధ పథకాల కింద నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పీఆర్ ఏఈ గంగరాజు సూచించారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.3.25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఏఈ పరిశీలించి నిర్మాణ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఏఈ మాట్లాడుతూ నిర్ణయించిన నాణ్యత ప్రమాణాల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు.

శ్రీశైలం బయలుదేరిన శివమాలధారులు



ఇరుముడులతో శివమాలధారులు

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన శివ మాల ధారులు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. స్థానిక రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గత నెలలో శివ మాల ధరించిన 67 మంది శివ భక్తులు గురువారం తెల్లవారుజామున ఇరుముడులతో గ్రామంలో ఊరేగింపుగా పలు ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. శివమాల ధారులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వారితో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొనటంతో గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

కోడుమూరు రూరల్: ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశా జ్యోతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. గురువారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణకు కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ నను కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. మార్చి 15వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బూజునూరులో గురువారం స్థానిక శివాలయంలో శివ దీక్షా మాలధారులకు గ్రామస్తులు అన్నదానం చేశారు. అనంతరం మాలధారులు ఇరుముడులతో శ్రీశైలానికి తరలివెళ్లారు.

గాడిచెర్లకు ఘన నివాళి



గాడిచెర్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు శాఖా గ్రంథాలయాల్లో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు వర్ధంతిని నిర్వహించుకున్నారు. ఆయా శాఖల గ్రంథాలయాధికారులు కౌసల్య, హనుమానాయక్ ఆధ్వర్యంలో గాడిచెర్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

గడివేముల: మండల పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన కాటేపోగు చిన్నస్వామి ఇల్లు విద్యుదాఘాతానికి గురై దగ్ధమైంది. బాధితుడు చిన్న స్వామి తెలిపిన వివరాలు.. మార్చిలో కుమారుడు జశ్వంత్ వివాహం ఉండటంతో రూ.2 లక్షలు తెచ్చుకుని బీరువాలో పెట్టుకున్నాడు. గురువారం ఇంట్లో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో బీరువాతో పాటు డబ్బు, ఇంట్లోని విలువైన సామగ్రి కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, సర్వేశ్‌రెడ్డి, నాగర్జునరెడ్డి పరామర్శించారు.

వలంటీర్ల సేవలు అమోఘం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా ఉంటూ అమోఘమైన సేవలు అందిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎంపికైన వలంటీర్లను గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ సలహాదారు జైపాల్‌రెడ్డి, ఎంపీపీ బోయ శారద తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. కరోనా సమయంలో కూడా ప్రతి వలంటీర్ తన పరిధిలో ఉన్న ప్రజలను కుటుంబ సభ్యులుగా చూసుకుంటూ వారికి కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చారన్నారు.

టీడీపీ మాటలు నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలు టీడీపీ నాయకులు చెప్పే మాటలు నమ్మిమోసపోవద్దని ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు సూచించారు. టీడీపీ నాయకులు 2014 ఎన్నికల్లో 600 పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వ పథకాలు కావాలంటే అప్పట్లో జన్మభూమి కమిటీలకు అంతో ఇంతో ఇచ్చుకోవాల్సి వచ్చేదన్నారు. గత టీడీపీ హయాంలోని ఇబ్బందులను, ప్రస్తుతం జగనన్న పాలనలో జరుగుతున్న మంచిని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటేయాలని ప్రజలను కోరారు.

వలంటీర్ వ్యవస్థ బాగుంది

ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ వ్యవస్థ బాగుందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ సలహాదారు జైపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చుతున్న తీరు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, కల్లూరు జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, హనుమంతురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- నంద్యాల డీఎస్పీ రవీంద్రారెడ్డి



పెసరవాయిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

గడివేముల: అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని నంద్యాల డీఎస్పీ రవీంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని చిందుకూరు, పెసరవాయి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశమై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడంలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న వీఆర్ఓ ఇంతియాజ్

ఓర్వకల్లు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)ల నిర్వహణపై అవగాహన కల్గివుండాలని నన్నూరు వీఆర్ఓ ఇంతియాజ్‌బాష అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సెక్టోరియల్ అధికారులకు ఈవీఎం పనితీరు గూర్చి క్లుప్తంగా వివరించారు. ఓటింగ్ ఎలా వేయాలి? వేసిన ఓట్లను ఎలా గుర్తించాలి? ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎం మొరాయిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అంశాలపై అవగాహన కల్పించారు. సెక్టోరియల్ అధికారులు పీఆర్ ఏఈ రామసుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ రామయ్య, ఏఓ సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ జీర్ణోద్ధరణ



జీర్ణోద్ధరణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలోని బొల్లవరం రస్తాలో వెలసిన మాచెర్ల లక్ష్మీచెన్నకేశవ సహిత ఆంజనేయస్వామి ఆలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సమీపంలో బాలాలయం నిర్మించి అందులో విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు అర్చకులు కృష్ణమూర్తి, చెన్న కేశవయ్యస్వామి తెలిపారు. ఆదోనికి చెందిన భాస్కరాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం పాత ఆలయం జీర్ణోద్ధరణం చేయనున్నట్లు తెలిపారు. కాగా శుక్రవారం నుంచి బాలాయలయంలోని స్వామి, అమ్మవార్లకు పూజలు చేసుకోవాలని అర్చకులు భక్తులకు సూచించారు. దాతల సహకారంతో త్వరలోనే కొత్త ఆలయాన్ని నిర్మిస్తామని నిర్వాహకులు దేశం నాగేశ్వరరెడ్డి, సీవీ రమణయ్య, రమణారెడ్డి తదితరులు తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.177 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ దివ్య గురువారం తెలిపారు. మండలానికి మొత్తం 9,074 పింఛన్లకు గాను రూ.2,71,49,500 మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఈనెల 29న కర్నూలు కె.వి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన క్రైట్స్ 2కే 24 జాతీయ సాంకేతిక సదస్సులో తమ కళాశాల ఈసీఈ విద్యార్థులు నజీయా, వైష్ణవి బహుమతులు సాధించారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టింగ్ కనెక్టింగ్ ఎలక్ట్రిసిటీ పదానికి ద్వితీయ స్థానం వచ్చిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ఎండీ శివరాం, హెచ్ఓడీ మల్లికార్జునరావు, కోఆర్డినేటర్ శంకర్‌నాథ్ తదితరులు అభినందించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కోడుమూరు రూరల్: రబీలో సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు, ఈకేవైసీ కోడుమూరు ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని వెంకటగిరి, అమడగుంట్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏఓ గురువారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రైతులతో సమావేశమై రబీ పంటల సాగు, దిగుబడులపై చర్చించారు. పంటల వివరాలను రైతులు యాప్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు, ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలన్నారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన షేక్ పీరావలి

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని మార్కాపురం స్టేజీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ పీరా వలి(45) దుర్మరణం చెందాడు. పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన పీరావలి కర్నూలులో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కోడుమూరు నుంచి కర్నూలుకు వస్తున్న ఆల్విన్ లారీని మార్కాపురం స్టేజీ శివాలయం వద్ద ప్రమాదవశాత్తూ పీరావలి ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వారపు సంత మార్కెట్ వేలం వాయిదా

గూడూరు: మున్సిపల్ వేలాలలో వారపుసంత మార్కెట్ వేలం గురువారం మరో సారి వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి తెలిపారు. గొర్రెల మాంసం మార్కెట్‌ను రూ.39,000, గొర్రెల కమేళాను రూ.35,000 చొప్పున పాట పాడి దక్కించుకున్నారు. వాయిదా పడిన వారపుసంతకు మార్చి 4న వేలం నిర్వహిస్తామన్నారు.

మార్చి, ఏప్రిల్ నెలల్లో విత్తు వద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మార్చి, ఏప్రిల్ నెలల్లో బోరు బావుల కింద ఎలాంటి పంటలు సాగు చేయరాదని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. మండలంలోని కల్లపరి, పులకుర్తి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏఓ గురువారం తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పొలాలను వేసవి దుక్కులు దున్నుకోవాలని, మిగిలి పోయిన పంట, కలుపు మొక్కలను తీసివేసి గట్లపై కాల్చివేయాలని సూచించారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి

గూడూరు రూరల్: కొలతల ప్రకారం పనులు చేస్తేనే పూర్తి వేతనం (రూ.272) మంజూరవుతుందని ఏపీఓ హసీనా ఉపాధి కూలీలకు సూచించారు. కె.నాగలాపురం పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె గురువారం పరిశీలించారు. కాసేపు కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో వలసలు వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పిస్తున్నామని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పిస్తామన్నారు.

దాతల సేవలు అభినందనీయం



బాధితులకు సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు:దాతల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 32వ వార్డు పరిధిలోని సుందరయ్యనగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కొట్టాలు దగ్ధమై, నిత్యావసర సరులు, వస్తువులు కోల్పోయిన బాధితులకు గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో వంట పాత్రలు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు సానశ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలితో కలిసి నేషనల్ ఎయిర్ క్లీన్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఎదుట జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శ్రీనివాసనగర్, ప్రకాష్ నగర్ మీదుగా నగరపాలక నూతన కౌన్సిల్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముని ప్రసాద్, డీఈఈ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి గాయాలు


పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. గోనవరం గ్రామానికి చెందిన స్టీఫెన్ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. వెనుక నుంచి లారీ వస్తుండగా సైడ్ ఇచ్చే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన స్టీఫెన్‌ను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

యువతకు స్ఫూర్తిగా అజీజ్ రచనలు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచనలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో అజీజ్ రచించిన 'వింధ్య' నాటకాల సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అజీజ్ రచనలు సమాజ ప్రయోజనాలను కోరుకుంటున్నాయన్నారు. కథలు, నవలలు, చారిత్రక గాథలు ఇలా విభిన్న సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఫామీద బేగం, అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మెహబూబ్‌బాషా, రచయిత ఇనాయతుల్లా పాల్గొన్నారు.

దాహం తీర్చేందుకు..

- ముందు జాగ్రత్త చర్యలు చేపట్టిన నగరపాలక సంస్థ
- రూ. 1.80 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఖరారు
- తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే కాలనీల గుర్తింపు
- జీడీపీలో 1.2 టీఎంసీల నీటి నిల్వలకు చర్యలు



గాజులదిన్నె ప్రాజెక్టు

కర్నూలు (టౌన్) : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు నగరపాలక సంస్థ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ప్రతి ఏడాది వేసవిలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడే కాలనీలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు సైతం చేపట్టారు. నగరపాలక సంస్థకు చెందిన నీటి ట్యాంకర్లతో పాటు బాడుగ పద్ధతిలో అదనంగా ట్యాంకర్లు తీసుకుంటున్నారు. దీంతో పాటు నగరంలోని 52 వార్డుల పరిధిలో ఉన్న బోర్లను రిపేరు చేయడం, తాత్కాలికంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్ ఖరారు చేశారు

రూ. 1.80 కోట్లు బడ్జెట్ కేటాయింపు

ప్రతి వేసవిలో నగర ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తారు. కాలనీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ఈ సారి వేసవికి కూడా అదే విధంగా మార్చి నుంచి సెప్టెంబర్ నెలలను పరిగణలోకి తీసుకొని రూ. రూ.1.80 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఈ బడ్జెట్ ద్వారా వచ్చే సెప్టెంబర్ నెల వరకు మంచి నీటి సమస్య ఏర్పడకుండా చూస్తారు. రూ.45 లక్షలతో చేతి పంపులు, బోర్‌వెల్స్, పైపులైన్ మరమ్మతులు, మరో రూ.45 లక్షలతో అవసరమైన చోట కొత్త బోర్‌వెల్స్, 1.5 హెచ్‌పీ మోటార్ల ఏర్పాటు చేయనున్నారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.45 లక్షలు ఖర్చు చేయనున్నారు.కోడుమూరు అర్బన్ నియోజకవర్గ పరిధిలో బోర్‌వెల్స్, ఫ్లాట్‌పామ్స్, 1.5 హెచ్‌పీ మోటార్ల ఏర్పాటుకు రూ.45 లక్షలు వినియోగించనున్నారు.

శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు

సుంకేసుల నుంచి వచ్చే నీటిని కర్నూలు నగర వాసులు వినియోగిస్తున్నారు. అయితే అక్కడి నుంచి మునగాలపాడు పంపింగ్ స్టేషన్‌కు నీరు చేరుకోవాలంటే 23 కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంది. సుంకేసుల నుంచి ఓపెన్ చానల్ ద్వారా నీటిని సరఫరా చేయడంలో మధ్యలో నీటి ఆవిరితో పాటు పెద్ద ఎత్తున్న నీటి చౌర్యం జరుగుతుంది. సమీపంలోని రైతులు మోటార్లు వేసుకొని తాగునీటిని తోడేస్తున్నారు. దీంతో శాశ్వతంగా ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.82 కోట్లు వెచ్చించి సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ వేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న ఈ పనులు త్వరగా పూర్తి అయితే భారీ స్థాయిలో నీటి వృథాను అరికట్టినట్టు అవుతుంది. ఇదిలా ఉంటే మునగాలపాడు పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలోనే 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.15.10 కోట్లు వెచ్చించి 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు పనులు పూర్తి చేశారు. దీనివల్ల అదనంగా కల్లూరు ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందుతుంది.



నీటిని తరలించేందుకు ముమ్మరంగా చేపడుతున్న పనులు

జీడీపీలో నీటి నిల్వకు చర్యలు

నగర ప్రజల తాగునీటికి సుంకేసుల రిజర్వాయర్‌లో సరిపడా నీటి నిల్వలు లేవు. దీంతో ప్రత్యామ్నాయంగా గాజుల దిన్నె ప్రాజెక్టులో కర్నూలు నగర వాసుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 1.2 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ఇప్పటికే నగరపాలక అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో జీడీపీ నుంచి ప్రతి రోజు 30 నుంచి 40 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈనెల 19 వ తేదీ నుంచే తుంగభద్ర నుంచి ప్రతి రోజు 250 క్యూసెక్కుల నీటిని గాజుల దిన్నె ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 20 రోజులకు సరిపడ నీరు ఉంది. ఈ నేపథ్యంలో జీడీపీలో నీటి నిల్వకు చర్యలు తీసుకున్నారు.

నీటి సమస్య ఉత్పన్నమయ్యే కాలనీల గుర్తింపు

వేసవిలో నగరంలో 23 కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తుతుందని అధికారులు గుర్తించారు. స్టాంటన్‌పురం, సోనియాగాంధీనగర్, అంబేడ్కర్‌నగర్, సమతానగర్, మమతానగర్, గీతా ముఖర్జీనగర్, ధనలక్ష్మీనగర్, సోమిశెట్టి నగర్ తదితర కాలనీలను గుర్తించారు. పైపులైన్ పూర్తి స్థాయిలో లేని కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తాగు నీటి సమస్య తలెత్తనివ్వం



వచ్చే వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్య ఎదురుకాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. ఇందుకు ముందస్తుగా బడ్జెట్ రూపొందించాం. ప్రస్తుతం సుంకేసుల నీటిని వాడుకుంటున్నాం. ప్రత్యామ్నాయంగా గాజుల దిన్నె ప్రాజక్టులో 1.2 టీఎంసీల నీటిని నగరవాసుల కోసం నిల్వ చేస్తున్నాం. సెప్టెంబర్ వరకు నగర వాసులకు ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవు.

– శేషాసాయి, మున్సిపల్ ఈఈ